నిరంజన్‌కు అభినందనలు



సనత్‌నగర్: బీసీ కమిషన్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నిరంజన్‌కు బేగంపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుధవారం అభినందనలు తెలిపారు. యువనేత అభిషేక్ అడపా ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు షేక్‌గౌస్, సురేష్‌యాదవ్‌లు బీసీ కమిషన్ కార్యాలయంలో నిరంజన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు తెలుసుకున్న అధికారులు



వారాసిగూడలో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు

బౌద్ధనగర్: ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని సికింద్రాబాద్ సర్కిల్ డీసీ సుభాష్ రావు సిబ్బందికి సూచించారు. బుధవారం బౌద్ధనగర్ డివిజన్‌లోని వారాసిగూడ, జామై ఉస్మానియా ప్రాంతాల్లో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డితో పాటు డీసీ సుభాష్‌రావు పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. జీహెచ్‌ఎంసీ ఈఈ, చిలకలగూడ, వారాసిగూడ పోలీసులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గణపతి హోమం



లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లోని ఏడు గుళ్ల దేవాలయంలో బుధవారం గణపతి హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నర్సింహ్మ, బస్తీ వాసులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ల ప్రత్యేక పూజలు



ఓల్డ్ బోయిగూడలో గణనాథుడికి పూజలు

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన గణనాథులు ఘనంగా పూజలు అందుకుంటున్నారు. ఓల్డ్‌బోయిగూడలో ఏర్పాటు చేసిన గణనాథుడికి మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, అత్తెల్లి అరుణగౌడ్‌లతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఘనంగా పూజలు నిర్వహించారు. కళాసీగూడలో లక్ష్మి గణపతి అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడు శ్రీ మహావిష్ణువుతో పాచికలు ఆడుతున్న గణనాథుడు ఆకట్టుకుంటున్నారు. ఇక్కడ 108 రకాల స్వీట్లతో గణనాథుడు పూజలు అందుకుంటున్నాడు.

మహానగర పరిశుభ్రత బాధ్యత అందరిదీ..



పారిశుధ్య సిబ్బందికి వీల్ బారో ఫ్రేమ్‌లను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: గ్రేటర్ హైదరాబాద్ మహా నగరాన్ని పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలనీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. బుధవారం తార్నాకలోని తన కార్యాలయం వద్ద జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందికి వీల్ బారో ఫ్రేమ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కొత్త వీల్ బారో ఫ్రేమ్‌ల ద్వారా చెత్త తరలింపు సులభంగా మారి పారిశుధ్య కార్మికులకు చెత్త తరలింపులో కొంత శ్రమ తగ్గుతుందన్నారు. హైదరాబాద్‌ను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడానికి జీహెచ్‌ఎంసీ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. దీనిపై ప్రజలను చైతన్యం చేయాలనీ అధికారులకు సూచించారు. అందుకు ప్రజలందరూ సహకరించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, సికింద్రాబాద్ డీసి సుభాష్, సానిటేషన్ డీఈ వెంకటేష్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో టమాటా కిలో రూ.27, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 45, బెండకాయ 55, పచ్చిమిర్చి 18, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరిబీర 50, క్యాబేజీ 16, క్యారెట్ 50, దొండ 45, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 90, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 19, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 44, ఆలుగడ్డ 39, చామగడ్డ 45, మొరంగడ్డ 65, కందగడ్డ 65, సొరకాయ 23, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 5–6, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ షాహీద్‌పాషా తెలిపిన మేరకు.. ఆలుగడ్డ బావి నుంచి మెట్టుగూడ వైపు వచ్చే ప్రధాన రోడ్డు మార్గంలోని బస్టాండ్ పక్కన సుమారు 65–70 ఏళ్ల వయస్సు గల ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. ఇది గమనించిన ప్రయాణికులు లాలాగూడ పోలీసులకు సమాచారం అందజేయగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెంటనే గాంధీ మార్చురీకి తరలించారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు పసుపు రంగు షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

నిమజ్జనం నిర్విఘ్నంగా సాగాలి

గణనాథుని నిమజ్జనానికి చురుగ్గా ఏర్పాట్లు

- సమస్యలు తక్షణం పరిష్కరించండి
- డీసీ సుభాష్‌రావు, ఏసీపీ జైపాల్‌రెడ్డి



చిలకలగూడ మైదానంలో నీటి కొలనును పరిశీలిస్తున్న దృశ్యం

చిలకలగూడ : ప్రత్యేకంగా రూపొందించిన మండపాల్లో విశేష పూజలు అందుకుంటున్న గణపయ్యను గంగ ఒడికి చేర్చేందుకు నిమజ్జన ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు, ఈఈ ఆశాలత, చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డిలు బుధవారం చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, జామై ఉస్మానియా తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పలు అంశాలపై సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. రహదారుల ప్యాచ్‌వర్క్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, మ్యాన్‌హోల్స్, మురుగు ఓవర్‌ఫ్లో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గణనాథుని శోభయాత్ర జరిగే ప్రాంతాల్లో చెట్టు కొమ్మల తొలగింపు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించి గుంతలు పడిన రహదారులు, మురుగు నీటి ఓవర్‌ఫ్లో, పాడైన మ్యాన్‌హోల్స్‌ను గుర్తించి నివేదికలు రూపొందించి ఆయా విభాగాలకు అందించారు. రేపటి నుంచి నిమజ్జనం, శోభయాత్ర కార్యక్రమాలు ఊపందుకోనున్న నేపథ్యంలో యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చిలకలగూడ మైదానంలో...

చిలకలగూడ మున్సిపల్ మైదానంలో చేపట్టిన నిమజ్జన ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. రెడీమేడ్ కొలను, 12 అడుగుల లోతుగల తాత్కాలిక తటాకం, విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్ తదితర ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఐదు రోజుల్లో వందలాది గణనాథుని విగ్రహాలను చిలకలగూడలో ఏర్పాటు చేసిన తాత్కాలిక నీటి కొలనుల్లో నిమజ్జనం చేసినట్లు వివరించారు. చిలకలగూడ సీఐ అనుదీప్‌లతోపాటు ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

14న మెగా రక్తదాన శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న జయకర్ డేనియల్ తదితరులు

రాంగోపాల్‌పేట్: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ అధ్యక్షులు జయకర్ డేనియల్, కో ఆర్డినేటర్లు జవహర్ కెనెడీ, రెవరెండ్ డాక్టర్ నవీన్ చిట్టాయ్, రెవరెండ్ జాసన్ డేవిడ్‌లు వైఎంసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వైఎంసీఏ ఏర్పాటు చేసి 180 ఏళ్ల అవుతున్న సందర్భంగా తలసీమియా, హెచ్‌ఐవీ, కేన్సర్ ఈ మెగా రక్తదాన శిభిరం ఏర్పాటు చేశామని చెప్పారు. సికింద్రాబాద్ వైఎంసీఏలో 14వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ రక్తదాన శిభిరం కొనసాగుతుందన్నారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిరోజ్‌ఖాన్ తదితరులు హాజరుకానున్నారని చెప్పారు.

శోభయాత్రలో తగిన జాగ్రత్తలు పాటించాలి

చిలకలగూడ : చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను బుధవారం ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు. శోభయాత్రలో తగిన జాగ్రత్తలు పాటించాలని మండప నిర్వాహకులకు సూచించారు. చిలకలగూడ, పద్మారావునగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, వారాసిగూడ, నామాలగుండు, ముషీరాబాద్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో పర్యటించి మండపాల వద్ద భద్రత, గణనాధుల నిమజ్జన రూట్‌మ్యాప్, నిమజ్జన వాహనాల క్యూఆర్ కోడ్ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా రవీందర్



పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గ సభ్యులు

సనత్‌నగర్: పీఆర్‌టీయూ సికింద్రాబాద్ మండల కార్యవర్గ సమావేశం బుధవారం బేగంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంబీ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా సంతోషకుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా సుమన్ నోయెల్, ఉపాధ్యక్షులుగా రాజేందర్, కార్యదర్శిగా విజయరమణి, మహిళా కార్యదర్శిగా వరలక్ష్మీలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రతాప్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల పరిశీకులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ వ్యవహరించారు. పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మండల మాజీ అధ్యక్షులు సీహెచ్.నారాయణ, తిరుమలగిరి మండల మాజీ ప్రధాన కార్యదర్శి సైదులు, సైదాబాద్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు నటరాజ తదితరులు పాల్గొన్నారు.

సంచాలన్ భవన్ ఎదుట ధర్నా



సంచాలన్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ సభ్యులు

అడ్డగుట్ట: రైల్వే రవాణాలో సురక్ష కిట్‌లో పేలుడు ప్రమాదపు డిటోనేటర్స్ ఏర్పాటు చేయడం వలన రవాణాలో ఏ క్షణం ప్రమాదం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సంచాలన్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ రైల్వేలో పని చేస్తున్న ట్రైన్ మేనేజర్స్‌కు లైన్ బాక్స్‌లు తీసేసి వాటి స్థానంలో ట్రాలీ బ్యాగ్స్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. డ్యూటీ నిర్వాహణలో రైల్వే బోర్డు అధికారులు ఏర్పాటు చేసిన రక్షణ కిట్‌లో వివిధ రకాల ప్రమాదపు పేలుడు పదార్థాలు ఉన్నాయని, వాటిని లైన్ బాక్స్‌లో భద్రపరిచే అవకాశం కల్పించాలని కోరారు. ఈ రక్షణ కిట్‌కు సంబంధించి ఆయా డివిజన్లలో బాక్సులు ఏర్పాటు చేసే విధంగా ప్రత్యేక సెల్లార్లు ఏర్పాటు చేయాలన్నారు. ధర్నాలో కౌన్సిల్ జోనల్ కార్యదర్శి రత్నేష్ కుమార్, అధ్యక్షుడు పార్థసారథి, సికింద్రాబాద్ కార్యదర్శి కట్కూరి ప్రవీణ్, దండు గంగాధర్, క్రిష్ణ, ఇక్బాల్, మధుసూదన్, ఆది శేషగిరి వివిధ డిపోల ట్రైన్ మేనేజర్స్ పాల్గొన్నారు.

ఖబ్రస్థాన్ సమస్యకు పరిష్కారం



ఎమ్మెల్యే తలసానికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ నివాసితులు

సనత్‌నగర్: బేగంపేట ముస్లిం ఖబరస్థాన్‌కు స్థలం కేటాయించడంతో స్థానికులు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆధీనంలో ఉన్న ఎకరన్నర స్థలం కేటాయింపు జరిపే క్రమంలో ఆ స్కూల్ యాజమాన్యంతో పలుమార్లు ఎమ్మెల్యే చర్చలు జరిపారు. వారిని ఒప్పించి సబ్‌స్టేషన్ పక్కన ఉన్న ఆ ఖాళీ స్థలాన్ని ఖబరస్థాన్‌కు కేటాయించేలా చేశారు. అంతేకాదు ఖబరస్థాన్ అభివృద్ధి కోసం జీహెచ్‌ఎంసీ నుంచి రూ.3 కోట్ల నిధులను కేటాయించేలా చేయడంలో సఫలీకృతులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి పూలమాలలు, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బంజారాహిల్స్: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఖైరతాబాద్ సర్కిల్–7 డీటీ సయ్యద్ అంజద్ అలీ బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఓ ఇంటిపై దాడి చేసి 39 బ్యాగుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఖైరతాబాద్‌లోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు. నిందితురాలిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు నూర్‌సాబాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బేగంపేట శ్యామ్‌లాల్ బిల్డింగ్ వద్ద నిమజ్జన కోలాహలం

అన్నదాన కార్యక్రమాలు

బౌద్ధనగర్: గణపతి నవరాత్రోత్సవాలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం జామై ఉస్మానియా లోని సిద్ధి వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద సుంకు రాంచందర్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా న్యూ అశోక్ నగర్‌లో గణేశుని మండపం వద్ద నల్ల మధు ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద వితరణ చేశారు.



జామై ఉస్మానియాలో..



న్యూ అశోక్ నగర్‌లో..



తార్నాకలోని భారత్ పెట్రోల్ బంక్‌లో..



ఐడీహెచ్ కాలనీలో ఎమ్మెల్యే శ్రీగణేష్



అశోక్‌నగర్‌లో వైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కల్వ సుజాత, నాగేందర్ రాజ్ తదితరులు



వర్షిత్ సరోవర్ అపార్ట్‌మెంట్‌లో..



గణపతి పూజల్లో పాల్గొన్న చిన్నారి విద్యార్థులు



గణనాథున్ని దర్శించుకుంటున్న ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

మండపాల వద్ద సందడి

ఏకదంతుడి సేవలో భక్తజనం పునీతులవుతున్నారు. వినాయక మండపాల వద్ద భజనలు, కీర్తనలు, లడ్డూ వేలంపాటలు, అన్నదాన కార్యక్రమాలతో సందడి వాతావరణం నెలకొంది. రాజకీయ ప్రముఖులు ఆయా మండపాల్లో కొలువుదీరిన గణనాధులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులను అలరిస్తున్నాయి. రోజుకొక ప్రత్యేక కార్యక్రమంతో వినోదాన్ని పంచుతున్నారు. గణనాధుడి మండపాల్లో జరుగుతున్న విశిష్ట సేవలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



సనత్‌నగర్ 60 ఫీట్ల రోడ్డులో..



బీకేగూడలో..



బేగంపేటలో..







మోడల్‌కాలనీలో..





లాలాపేట చంద్రాబాబునగర్‌లో..



తార్నాకలోని జూనియర్ కళాశాలలో..



లాలాపేట లేబర్ అడ్డా వద్ద..



సీతారామాంజనేయ భజన సమాజంలో ..